బాలుడి అదృశ్యం



షేక్ మస్తాన్

అత్తాపూర్: మదర్సాలో చదువుకుంటున్న చిన్నారి తోటి స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లి కనిపించకుండాపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బండ్లగూడ ప్రాంతానికి చెందిన షేక్ అఫ్రోజ్, నేహా ఫాతిమాలు భార్యభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు షేక్ మస్తాన్(9)ని సులేమాన్‌నగర్‌లోని దారుల్ ఉల్మ్ ఇబ్రహీమియా మదర్సాలో చేర్పించి ఉర్దూ నేర్పిస్తున్నారు. ఆదివారం ఉదయం షేక్ మస్తాన్ కనిపించడం లేదని శనివారం సాయంత్రం బస్తీకి చెందిన నలుగురు పిల్లలతో కలిసి ఆడుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదని మదర్సా నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా బాలుడి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అత్తాపూర్ పోలీసులు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ కమిషనర్ అహ్మద్ సైపుల్లాకు వినతిపత్రం అందజేస్తున్న వినోద్ చౌగ్లే

జియాగూడ: జియాగూడ మూసీ ప్రాంతంలో పర్యటించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అహ్మద్ సైపుల్లా అన్నారు. ఆదివారం జియాగూడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లే కార్యకర్తలతో అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వినద్ చౌగ్లే మాట్లాడుతూ.. జియాగూడ మూసీ పరీవాహక ప్రాంతం కావడం, ఇక్కడే చెత్త డంపింగ్ యార్డ్ ఉండడం వల్ల దోమల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. అధికారులు సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జియాగూడ డివిజన్ అధ్యక్షుడు పి.దర్శన్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి 'విస్తరణ' పూర్తయ్యేనా?

- అధ్వానంగా మారిన రాళ్లగూడ రహదారి
- మొత్తం 3.4 కిలోమీటర్ల మేర విస్తరణ
- నత్తనడక సాగుతున్న విస్తరణ పనులు
- వాహనదారులకు తప్పని నరకయాతన
- అధికారుల తీరుపై సర్వత్రా నిరసన



అధ్వానంగా తయారైన రాళ్లగూడ రహదారి

శంషాబాద్: శంషాబాద్ నుంచి షాబాద్ వైపు వెళ్లే రాళ్లగూడ రహదారి అధ్వానంగా మారింది. రహదారిని విస్తరిస్తున్న కారణంగా గడచిన ఏడాదిగా రోడ్డు మరమ్మతులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఆ రహదారి కాస్తా గుంతలమయమై అధ్వానంగా తయారైంది. విస్తరణ పనులను ప్రారంభించిన హెచ్‌ఆర్‌డీసీ ఇటీవల మళ్లీ నిలిపివేయడంతో రహదారి విసర్తరణ ఎప్పటికి పూర్తవుతుందో..? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

ఏం జరిగిందంటే...

శంషాబాద్ పట్టణంలోని బస్టాండ్ నుంచి ఒయాసిస్ స్కూల్ వరకు మొత్తం 4 నాలుగు కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులను ఏడాది కిందట రెండు ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌ఆర్‌డీసీతో పాటు ఆర్‌అండ్‌బీ నుంచి టెండర్లు దాఖలై పనులు అప్పగించారు. అయితే ఒకే రోడ్డును రెండు సంస్థలు పనులు అప్పగించడం వివాదాస్పదంగా మారింది. దానిని పరిష్కరించేందుకు కొన్ని మాసాలు గడిచింది. ఎట్టకేలకు బస్టాండ్ నుంచి పద్మావతి ఫంక్షన్ హాల్ వరకు 3.4 కిలో మీటర్ల మేర రహదారిని విస్తరించేందుకు హెచ్‌ఆర్‌డీసీకి ఆమోదం లభించింది. వివాదాల పరిష్కారానికి కొన్ని నెలల సమయంపోగా ఇటీవల పద్మావతి ఫంక్షన్ హాల్ వైపు నుంచి రోడ్డును విస్తరించే పనులు హెచ్‌ఆర్‌డీసీ మొదలు పెట్టినట్లే పెట్టి వెంటనే నిలిపివేసింది.

ఓఆర్ఆర్ వరకు..

బస్టాండ్ నుంచి ఓఆర్‌ఆర్ వరకు ఎనభై ఫీట్ల వెడల్పులో రహదారిని విస్తరించనున్నారు. ఓఆర్‌ఆర్ నుంచి ఒయాసిస్ సమీపం వరకు రహదారిని వంద ఫీట్ల మేర విస్తరించనున్నారు. పట్టణంలో పాక్షికంగా కొంత మేరకు ఆస్తినష్టం ఉన్నా పద్మావతి ఫంక్షన్ హాల్ తర్వాత కొంత ఖాళీ స్థలం విస్తరణలో కోల్పోనుంది. వీటికి సంబంధించిన నోటీసులను కూడా ఇప్పటికే జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

మరమ్మతులు లేవు...

సంవత్సరకాలంగా వర్షాలు ఇతరత్రా కారణాలతో ఈ రహదారి మొత్తం గుంతలు పడి అస్తవ్యస్తంగా.. అధ్వానంగా తయారైంది. విస్తరణ కారణంగా కనీస మరమ్మతులు కూడా నిలిపివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదిక పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

కొన్ని సమస్యల పరిష్కారం కారణంగా పనుల ప్రారంభం ఆలస్యం అయింది. విస్తరణ పనులు ఇప్పటికే మొదలు పెట్టినా అత్యవసర పనుల కారణంగా ఇక్కడ పనులు నిలిచిపోయాయి. వర్షాలు నిలిచిపోయిన వెంటనే విస్తరణ పనులను పునఃప్రారంభిస్తాం. వేగవంతంగా పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– విక్రమ్, డీఈ, హెచ్‌ఆర్‌డీసీ

యూటర్న్ ప్రారంభించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రమిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించి మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతంలో గతంలో ఉన్న యూటర్న్‌ను పునరుద్ధరించాలని స్థానికులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ... బాబుల్‌రెడ్డినగర్, ఆదర్శనగర్, టాటానగర్, బృందావన్ కాలనీ, మార్కండేయనగర్, ప్రగతికాలనీ, రామకృష్ణాహిల్స్ కాలనీ ప్రజలు యూటర్న్ మూసీ వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ వరకు గల ఇన్నర్ రింగ్ రోడ్డులోని సాలిటర్ స్కూల్ వద్ద యూటర్న్ గతంలో ఉండేదన్నారు. అధికారులు ఇటీవలే మూసి వేయడంతో దుర్గానగర్ వరకు వెళ్లవలసి వస్తుందన్నారు. శివరాంపల్లి పాఠశాలకు ఈ ప్రాంతాల నుంచి 600 మంది వరకు విద్యార్థులు వెళ్తుంటారని వారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి అధికారులతో చర్చించి యూటర్న్ పునః ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారని వారు పేర్కొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫైమిద



మాట్లాడుతున్న ఫైమిద

రాజేంద్రనగర్: భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాజేంద్రనగర్ మండల 15వ మహాసభ సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్‌లో ఆదివారం ఉదయం జరిగింది. మహాసభకు ముఖ్య అతిథులుగా భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఫైమీద, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కమలమ్మ, సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రియాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫైమీద మాట్లాడుతూ... రోజు రోజుకూ మహిళలపై హింస పెరుగుతోందని, పురుషాధిక్య సమాజంలో మహిళల పట్ల చిన్న చూపు చూడడం వల్ల సమాజంలో వివక్ష కొనసాగుతున్నదన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం, మహిళల హక్కుల రక్షణ కోసం, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం మహిళా సమాఖ్య బలోపేతం చేసి హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆనంద్‌గౌడ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శులు విజయానంద్‌గౌడ్, ఎం.డి.షఫీ, ఆఫీస్ కార్యదర్శి సత్యం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సీపీఐ నాయకురాలు, పాండు, మొగులయ్య, చింతల్‌మెట్ సయ్యద్, ఖాజా, ఖలీల్, సాబీర్, రామచందర్, సలీం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక...

రాజేంద్రనగర్ మండల నూతన కమిటీ మండల అధ్యక్షులుగా కె.మునీశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కన్యగారి లక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్.డి.రేష్మ, జి.రాములమ్మ, బి.శాంతమ్మ, సహాయ కార్యదర్శులుగా కె.వాణి, ఎం.సుగుణమ్మ, కార్యవర్గ సభ్యులుగా కె.శారద, ఊర్మిళ, సుజాత, వనమ్మ, యాదమ్మ, సుశీల, పార్వతమ్మ, మంగలను ఎన్నుకున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

బండ్లగూడ: దేవాలయాల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. బోనాల పండగ నిర్వహణకు విరాళాలు ఇచ్చి విజయవంతం చేసిన దాతలను హైదర్షాకోట్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం దేవాలయ నూతన కమిటీ ఏర్పాటుకు సభ్యులు సమావేశమయ్యారు. ఎవరైతే కమిటీలో పోటీ చేయాలనుకున్నా లేదా తమ ఓటు వేసి ఎన్నుకోవాలనుకున్నా రూ. 5 వేలు ముందుగా ఆలయం ఖాతాలో కట్టి శాశ్వత సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ శాశ్వత సభ్యత్వం పొందాలి అనుకునే వారు ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు డబ్బులు కట్టాలన్నారు. 17వ తేదీన ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకుంటారన్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకోవాలి అనుకునే వారు లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. గమనించి ఆ సమయంలో డబ్బులు కట్టి రసీదు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో దేవాలయల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతరిక్షంలో సత్తాచాటుతున్న భారత్



మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: అంతరిక్షంలోనూ ప్రపంచ దేశాలకు ఏమాత్రం తీసుకోకుండా భారతదేశం సత్తాచాటుతున్నదని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 124వ మన్ కీ బాత్‌లో వివరించారని బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మణికొండలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి ఆరు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..., ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్‌డే ఘనంగా జరుపుకోవాలని తెలిపారన్నారు. చిన్నారులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. తమ శక్తి సామర్థ్యాలను మెరుగుపరచుకోవటంతో పాటు వాటిని ప్రపంచానికి చాటాలని ప్రధాని మోదీ సూచించారన్నారు. స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని, బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలన్నారు. పార్టీ మణికొండ ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, వెంకటాచారి, డి.రాజేష్, ఆనందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కోసం ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి



హైదర్‌గూడలో మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతున్నదని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. మోదీ మన్‌కీబాత్ ఎపిసోడ్‌ను అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సులిగే మల్లేష్ ఇంట్లో వీక్షించారు. 21వ శతాబ్దపు భారతదేశంలో సైన్స్ ఒక కొత్త శక్తితో ముందుకు సాగుతోందన్నారు. కొన్ని రోజుల క్రితం మన విద్యార్థులు ఇంటర్నేషనల్ కెమిస్ట్రీలో ఒలంపియాడ్స్ మెడల్స్ గెలిచారన్నారు. సందీప్ కుచి, దేవేష్ పంకజ్, దేవదత్, ప్రియదర్శి, ఉజ్వల్ కేసరి ఈ నలుగురు భారతదేశానికి ఖ్యాతి తెచ్చారన్నారు. గణితంలోనూ భారత్ తన గుర్తింపును మరింత బలోపేతం చేసుకుందన్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలంపియాడ్‌లో మన విద్యార్థులు మూడు గోల్డ్ మెల్స్, రెండు సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించారని నరేంద్రమోదీ తెలిపినట్లు వివరించారు. రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు, శక్తి కేంద్రం ప్రముఖ్ సాబాద విజయ్‌కుమార్, బూత్ అధ్యక్షుడు బీట్యాకారి సతీష్, సులిగే శ్రీనివాస్, సులిగే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్: ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ విభాగ్ హాస్టల్ కన్వీనర్ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ గృహాల్లో నెలకొన్న సమస్యలను ఆదివారం పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులు మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచి నీటి సమస్య కూడా అధికంగా ఉందని విద్యార్థులు చెప్పినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు అఖిల్, తిరుపతి, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'క్రీడల్లో దూసుకుపోతున్న తెలంగాణ'

మంత్రి జి.వివేక్

గోల్కొండ: క్రీడల్లో తెలంగాణ దూసుకుపోతుందని మంత్రి జి.వివేక్ అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్ ఇందిరా గాంధీ కమ్యూనిటీహాల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రాజు వస్తాద్, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్, హైదరాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి వినేష్‌బాబు, బాక్సింగ్ కోచ్‌లు శివకుమార్, శశాంక్, సన్నీ, షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులున్నారు.

'మురుగునీటిని మళ్లించడంలో నిర్లక్ష్యం'



చెరువు ప్రాంతంలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మణికొండ: హైదరాబాద్‌కు మంచినీటిని తరలిస్తున్న గండిపేట క్యాండూట్, ముష్కి చెరువులో పరిసర ప్రాంతాల మురుగు నీరు కలుస్తుందని, దాన్ని ఇప్పటి వరకు మళ్లించకుండా మున్సిపల్ కమిషనర్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు ఆరోపించారు. ఆదివారం అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, అధికార ప్రతినిధి ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు ముష్కి చెరువు పరీవాహక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మురుగు నీరు యథేచ్ఛగా క్యాండూట్‌లో కలుస్తున్నదన్నారు. ఆ నీటిని మణికొండలో ట్యాంకర్ల ద్వారా, హైదరాబాద్ ప్రజలకు తాగేందుకు వినియోగిస్తున్నారన్నారు. ముష్కి చెరువు చుట్టూ వరద నీరు రాకుండా అడ్డుగా నిర్మించిన కట్ట ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని మురుగునీరంతా చెరువులో కలుస్తోందన్నారు. హైడ్రా కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా చెరువు వద్ద ఎలాంటి నివారణ చర్యలు చేపట్ట లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు బాబురావు, సుమన్, శ్రీశైలం, మహమ్మద్ ఆరీఫ్, కిరణ్, సుమ నళిని, రేఖ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెపటైటిస్ నివారణ



స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్, ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నేడు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

రాయదుర్గం: భారతదేశంలో సుమారు 40 మిలియన్ల మంది దీర్ఘకాలిక హెపటైటిస్ బితో జీవిస్తున్నారని నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ క్లినికల్ ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజీ డాక్టర్ జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'హెపటైటిస్ : దీన్ని ఛేదిద్దాం' అనే థీమ్‌తో 2025లో నిర్వహించుకుంటున్న ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.దీనికి చికిత్స ఉన్నప్పటికీ తీవ్ర సమస్యలు తలెత్తే వరకూ గుర్తించబడదన్నారు. అవగాహన లేకపోవడం లేదా సాధారణ స్క్రీనింగ్ చేయకపోవడం వలన చాలా మందికి ఆలస్యంగా రోగ నిర్ధారణ జరుగుతోందన్నారు. అవగాహనతోనే దీన్ని జయించవచ్చని డా.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రశ్న: హెపటైటిస్ అంటే ఏమిటి ?

జ: హెపటైటిస్ అనేది కాలేయ వాపు. ఇది సాధారణంగా వైరస్ వల్ల వస్తుంది. మద్యం, మందులు లేదా రోగనిరోధక వ్యవస్థ దాడి చేయడం వంటివి కారణాలు కావచ్చు. చికిత్స చేయకుండా వదిలేస్తే కాలేయాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తూ చివరికి కాలేయ వైఫల్యం లేదా కాలేయ క్యాన్సర్‌కి దారి తీస్తుంది.

ప్ర: హెపటైటిస్ రావడానికి గల కారణాలు ?

జా: వైరల్ హెపటైటిస్.. అయిదు ప్రధాన రకాల వైరస్‌లు–ఏ,బి,సి,డి,ఈ. ఏ,ఈ కలుషిత ఆహారం లేదా నీటి వల్ల, బి,సి రక్తం, శరీర ద్రవాల ద్వారా, డీ హెపటైటిస్ బి ఉన్నవారికి మాత్రమే వస్తుంది. రెండోది: ఆల్కహాలిక్ హెపటైటిస్.. అధిక మోతాదులో మద్యం వల్ల కాలేయకణాలు దెబ్బతింటాయి, దీర్ఘకాలంలో సిర్రోసిస్‌కి దారితీస్తుంది. మూడోది: నాన్ ఆల్కహాలిక్ స్టీటో హెపటైటిస్ (ఎన్ఏఎస్‌హెచ్), ఆల్కహాల్ తీసుకోని వారిలో ఎక్కువ బరువు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారిలో తరచూ కనిపిస్తుంది. నాల్గోది : ఆటోఇమ్యూన్ హెపటైటిస్ రోగనిరోధక వ్యవస్థ పొరపాటుగా కాలేయాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తుంది. మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇక ఐదవదిఫ డ్రగ్ ఇండ్యూస్డ్ హెపటైటిస్.. కొన్ని మందులు, ఆయుర్వేద సప్లిమెంట్లు కాలేయంపై విష ప్రభావం చూపుతాయి.(అధిక దోసు పారాసిటమాల్, టీబీ మందులు, లివ్–52 మొదలైనవి)

ప్ర: హెపటైటిస్ లక్షణాల గురించి..

దా: ముఖ్యంగా అలసట, వికారం, ఆకలి లేకపోవడం, ముదురు మూత్రం, పసుపు రంగు చర్మం/కళ్ళు (జాండీస్), పొత్తికడుపు నొప్పి, జాయింట్ నొప్పులు, చాలా మంది దీర్ఘకాలిక దశ వరకు ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు.

ప్ర: ఎవరు ప్రమాదంలో ఉన్నారు.. . వైరల్ హెపటైటిస్ వచ్చే పరిస్థితులు ?

దా: సూదులు, రేజర్లు పంచుకోవడం, అసురక్షిత లైంగిక చర్య, ఆసుపత్రుల్లో పని, అపరిశుభ్రత ఉండే ప్రదేశాల్లో, పచ్చబొట్లు/కుట్లు, డయాలసిస్‌పై ఉండే రోగులు ఎన్ఏఎస్‌హెచ్, అధిక బరువు, మధుమేహం, కొలెస్ట్రాల్ ఉన్నవారు. ఏఐహెచ్– మహిళలు, ఆటోఇమ్యూన్‌రోగాల కుటుంబ చరిత్ర ఉన్నవారు.డీఐఎల్ఐ– ఎల్ఐవి 52, పారాసిటమాల్, స్టెరాయిడ్స్ వాడేవారు ప్రమాదంలో ఉన్నట్టే.

ప్ర: నివారణ మార్గాలు ..?

దా: హెపటైటిస్ ఏ, బీ టీకాలు వేయించుకోవాలి. వ్యక్తిగత వస్తువులు పంచుకోవద్దు. చేతులు తరచూ కడుక్కోవాలి, పచ్చబొట్లు/కుట్లు వేయించుకునే చోట పరిశుభ్రత ఉండాలి. ఆల్కహాల్ మానుకోవాలి, బరువు తగ్గాలి, షుగర్ నియంత్రణలో ఉంచాలి. హెర్బల్ మందులు తీసుకునే ముందు హెపటాలజిస్టను సంప్రదించాలి. అవగాహన కలిగి ఉండాలి.

సమస్యలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమలో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్‌లో ఆదివారం కమ్యూనిటీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో సాంఘిక సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులు గ్రామీణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించారు. విద్యా ప్రాముఖ్యత, బాలికా విద్య, గర్భిణులకు పోషకాహార విలువలను నాటిక ప్రదర్శనతో వివరించారు. మద్యపానం, ధూమపానంతో కలిగే అనర్థాలను తెలియజేశారు. మన ఆరోగ్యం–మన బాధ్యత అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

గాలిదొడ్డిలో ఉచిత వైద్యశిబిరం



రాయదుర్గం: ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గాలిదొడ్డిలో సేవా భారతి ఎల్విహెచ్ గ్రీన్ ల్యాండ్స్ డాక్టర్ ఈశ్వర్‌చందర్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ప్రతి బస్తీలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని వారు సూచించారు. శిబిరంలో పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య బృందం పాల్గొన్నారు.